# తెల్లమడచెట్లు

కెమెరా విజయ్‌కుమార్

కిరీట్రావ్‌కి ఊహ తెల్సిన తరువాత 'మగసాని తిప్ప' వెళ్ళడం ఇదే మొదటిసారి. దిగాంతల వరకు వ్యాపించిన సముద్రంలో గోదావరి కల్సిపోతూ మేట వేసిన దిబ్బల్లో ఆ దీవి ఒకటి. బలుసుతిప్ప నుంచి బయలుదేరి సముద్రం నదీ మమేకం అయిన ఆ నీళ్ళల్లో అరగంట నావ ప్రయాణం. అంతా 'డిస్కవరీ' ఛానల్ చూస్తున్న అనుభూతే. చుట్టూ వున్న ఉప్పనీళ్ళలో మునిగి తేలుతున్న నల్లమట్టి బురద నేల. దూరం నుంచి మొక్కలా కనపడిన పచ్చని ప్రదేశం, దగ్గరకు వెళుతున్నకొద్దీ ఆశ్చర్యం పెంచుతుంది. అవి దూరం నుంచి కనపడ్డట్టు మొక్కలు కాదు, పెద్ద పెద్దగా అలుముకొనిపోయిన వృక్షాలే! అయితే ప్రతి చెట్టూ తిరగవేసిన మర్రిచెట్టులా వుంది. ప్రతి వృక్షం చుట్టూరా వందలాది ఊడలు వేళ్ళ నుంచి విస్తరించి ఆకాశం వైపు పెరిగాయి. ఆ ఊడలు శీర్షాసనం వేసిన పాముల్లా వుండి చూడడానికి భయం వేస్తున్నాయి. పల్లం ప్రాంతంలో కనుచూపుమేర విస్తరించి వున్న వింత చెట్ల వంక భయం భయంగా చూస్తూ "తాతా ఈ చెట్ల పేరేంటి!" నావలో కూర్చుని భయంతో వాళ్ళ తాత బలరాముడి చేయి గట్టిగా పట్టుకొన్న కిరీట్రావ్ అడిగాడు.

"ఏవిట్రా అయ్యా? యియ్యా? యాటిని నల్లమడ సెట్లంటారు. పెపంచంలో ఇలాంటి యింత సెట్లు మరెక్కడా లేవంట. యీ సెట్ల పేనం సుట్టూర వున్న పిలకల్లో వుందట. యీ సెట్లంటే దేవుడికి శానా ఇదట. అందుకే సముదురిడ్ని ఎంత పోటు పెరిగినా ఈ పిలకల్ని ముంచకూడదని ఆగ్నేపించేడట" తరతరాలనుంచి మోసుకొస్తున్న పరిజ్ఞానాన్ని మనవడికి వివరించాడు బలరాముడు.

తాత చెప్పిన విషయాలు ఎందుకో నమ్మబుద్ది కాలేదు కిరీట్రావుకి. ఆ వింత చెట్లని గురించి తెల్సుకోవాలన్న కోరిక మాత్రం మనస్సులో ఘాడంగా నాటుకుపోయింది. గారాలు పోతున్నట్టుగా మెలికలు తిరిగిన పిల్లకాలవలో కొంచం సేపు ప్రయాణం చేసి చివరకు రేవులో ఆగింది నావ.

అలలకు ఊగుతున్న నావలోంచి తాత చేయి పట్టుకు దిగాడు కిరీట్రావ్.

రేవుకు వంద గజాల దూరంలో కుడి ప్రక్కన తుఫాన్ షెల్టర్. దాని చుట్టూ తల్లి దగ్గరున్న కోడిపిల్లల్లా రకరకాల పాకలు, పెంకుటిళ్ళు డాబాలు. ఆ ఇళ్ళ ముందు ఆరేసిన వలలు, నిలబెట్టిన తెడ్లు, పాడైన చిన్న నావలు, అది మత్స్యకారుల నివాసాలని నిర్ధారించేస్తున్నాయి. ఆ ఇళ్ళను ఆనుకొని 'మండల పరిషత్తు ఎలిమెంటరీ పాఠశాల, మగసాని తిప్ప అని వెలిసిపోయిన పేరుతో వున్న బోర్డు, కలిగిన సిమెంటు రేకుల షెడ్డు.

ఆ ఇళ్ళకు అరకిలోమీటరు దూరంలో దీవి మధ్యలో పెద్ద గుడి. ఆ చిన్న దీవిలో అంత గుడి వుండటం చూసి ఆశ్చర్యపోయాడు కిరీట్రావ్. అది బైరవస్వామి గుడి అని తాత చెబితే మరింత ఆశ్చర్యపోయాడు. 'క్షుద్రదేవుడి'కి అంత పెద్ద గుడిని చూడటం కిరీట్రావ్‌కి అదే మొదటిసారి.


గుడికి కిలోమీటరు దూరంగా దీవికి ఒక మూల చెట్ల క్రింద అరడజను గుడిసెలు. వాటి చుట్టూ మందలు, మందలుగా ఆవులు, మేకలు. సినిమాల్లో వేదరుషుల పర్ణశాలల సెట్టింగ్ లాగున్నాయి అనుకొన్నాడు కిరీట్రావ్. అలా అనుకుంటే కళ్ళుపోతాయని తెలియని పట్టణవాసుడు కిరీట్రావ్. తాత ఆ పర్ణశాలలకే తీసుకెళ్ళాడు.

రాకరాక పట్నం నుంచి మనవడు వచ్చాడని బోలెడంత హడావిడి చేసింది కిరీట్రావ్ అమ్మమ్మ. మనవడు వస్తున్నాడని వెన్న, నెయ్యి కాట్రేనికోన మోసుకెళ్ళి అమ్మి డబ్బులు దాచింది. ఆ అరడజను గుడిశల్లో ముప్పై మంది దాకా వున్నారు. మాటలు రాని చిన్న పిల్లలు తప్పించి అందరూ వచ్చి పలకరించారు కిరీట్రావ్‌ని. చివరకు అమ్మమ్మ చెల్లెలు భూలచ్చమ్మ వచ్చి ప్రక్కనే కూర్చుని "ఒరే అయ్యా... అమ్మా నాన్న బాగున్నారా? మీ తాత, నానమ్మ ఎలగున్నారు?... అల్లు ఇంకా మమ్మల్ని తిడతన్నారా??" అని బుగ్గలు నిమురుతూ అడిగింది. ఆమె బొట్టు గాజులు లేకుండా తెల్ల చీర కట్టుకొంది.

"అమ్మమ్మ... చిన్న అమ్మమ్మ అలాంటి చీర కట్టుకుందే? పాపం వాళ్ళు చాలా పేదవాళ్ళా?!" చిన్న అమ్మమ్మ వెళ్ళిపోయిన తరువాత అడిగాడు కిరీట్రావ్.

"దాని కరమ అలా కాలిందిరా అయ్యా... మీ చిన తాత పోయినేడు పాము కరచి సనిపోయాడు. దాంతో దీనిని ఎదవ ముండని సేసేశాం."

కిరీట్రావ్ మేనమామ పెళ్ళాం లక్ష్మికి బోలెడంత భక్తి. రోజూ ఉదయాన్నే స్నానం చేసి ఇంటికాడ నుంచే గుడికి ఓ డజను దండాలు పెట్టేది. కిరీట్రావ్‌కి బైరవస్వామి గుడి గురించి బోలెడు మహత్యాలు చెప్పింది. "వలబై, ఏబై ఏళ్ళ కిందట అల్లదిగో అక్కడ కనపడే దిబ్బుంది సూడు




దాని పక్కమ్మటే గోదారి పాయకానుకొని పాత గుడుండేదట. వరద కోతకు గుడి పునాదులు కోసుకుపోతుంటే, ఆ బైరవస్వామి గుడి పూజారి కల్లోకగపడి, యింక నేను గుడిని సంరచ్చించుకోలేక పోతన్నాను. నన్ను ఇక్కడి నుంచి తీసుకెల్లి వూరి మధ్యలో పెతిట్టేపించండి అని చెప్పి మాయమైపోయాడట. ఆ పంతులు గోరే మాట పెకారం మచ్చకార పెద్దలు ఈ గుడిని కట్టి బైరవమూర్తిని తెచ్చి ఈ గుడిలో పెతిట్టేపించారట. అంతే పాతగుడి పెళపెళమని కూలిపోయి గోదావరిలో కల్సిపోయిందట." అది విన్న కిరీట్రావ్‌కి అనుమానమొచ్చింది. వెంటనే భయం వేసి చెంపలేసుకొన్నాడు.

"ఆ పూజారి గారినినాకు చూపెట్టవు, చూడాలని వుంది" అత్త లక్ష్మిని అడిగాడు.

అయనేటి, ఆయన కొడుక్కూడా మొన మొన్ననే సనిపోయారు. పూజారిగోరి బుల్లి మనవడు పెదపూజారిగోరూ పెళ్ళం పార్మ తమ్మగోరూ ఈ గుడిని సూత్తున్నారు" అని చాల విచారంగా చెప్పింది లక్ష్మి.

మగసాని తిప్పలో వున్న పది రోజులు జంబో ద్వీపంలో టార్జాన్‌లా తిరిగాడు కిరీట్రావ్. సత్యనారాయణ రాజుగారి యాబై ఎకరాల కొబ్బరి తోటంతా కిరీట్రావ్‌దే. తోటకు అవతల సముద్రం ఒడ్డున తాత్కాలికంగా గుడారాలేసుకొని సీడ్‌ని సేకరిస్తున్న వందలాది మత్స్యకారుల కుటుంబాలు. ఆ పిల్లలతో కల్సి సీడ్ సేకరించడంలో మెలకువలు నేర్చేసుకొన్నాడు.

కిరీట్రావ్‌కి అర్థంకాని విషయాలు కొన్ని వున్నాయి. అందులో మొదటిది. పూజారి గారి భార్య కాని, కోడలు గాని చివరకు పూజారి మనవడు గాని గవర్నమెంటు వేయించిన బోరింగు పంపు దగ్గరకు వచ్చి నీళ్ళు పట్టుకుంటే నీళ్లకు వెళ్ళిన వాళ్ళు బిందెలు తీసుకొని దూరంగా ఎందుకు నిలబడతారు? రెండవది చిన అమ్మమ్మ మొగుడు పోయాడని తెల్లచీరలు కట్టుకోమంటున్నారు, బొట్టు, గాజులు పెట్టుకోనీయటంలేదు. మరి పూజారిగారి భార్య, కోడలు రంగు చీర లెందుకు కట్టుకుంటారు?? బొట్లు పెట్టుకోరుగాని. బంగారు గాజులేసుకొంటారు. అన్నిటికంటే అర్థం కానిది కిరీట్రావ్ బంధువు లెవరూ గవర్నమెంటు బోరింగ్ ముట్టుకోకూడదు. తాగడానికి నీళ్ళు కావాలంటే ఎవరైనా కొట్టి నీరు పోయాల్సిందే. తొమ్మిదో తరగతి చదువుతున్న కిరీట్రావ్‌కి ఈ విషయాలు అర్థంకాక బుర్రంతా పజిల్లా అయిపోయేది.

* * * *** * * *

రెండవసారి మగసానితిప్ప వెళ్ళే అవసరం అంత త్వరగా ముంచుకొస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ సంవత్సరం నవంబరులో వచ్చిన ఉప్పెన వల్ల మూడు మండలాలే తుడిచిపెట్టుకుపోయాయి. అందులో మగసానితిప్ప వున్న కాట్రేనికోన మండలమొకటి. సంభవించిన అపార నష్టంలో ఎక్కువ ప్రాణనష్టం జరిగింది మగసానితిప్పలోనే అని రెండవ రోజు రాత్రి వార్తల్లో చెబుతూ విమానం నుంచి తీసిన ఫోటో క్లిపింగ్స్ చూపారు. అది చూసి కిరీట్రావ్ అమ్మ దిక్కుతోచక ఏడుస్తూ కూలబడిపోయింది. విషయాలు తెలిసే దారి లేక కిరీట్రావ్ నాన్న బయలుదేరుతుంటే నానా యాగీ చేసి కిరీట్రావ్ కూడా బయలుదేరాడు. అతి కష్టంమీద ఉప్పెన వచ్చిన మూడవరోజు సాయంత్రానికి కాట్రేనికోన చేరుకున్నారు. తుపాను వచ్చి మూడు రోజులు తరువాత కూడా రోడ్లమీద పడివున్న చెట్లను తొలగించలేదు. తొలగించడం కూడా అయ్యేపనిలా కనిపించడంలేదు. మొదళ్ళలో విరిగి రోడ్ల మీద పడిన కొబ్బరి చెట్లే వేల సంఖ్యలో వున్నాయి. ఆ పెనుతుపాను గాలులకు సాక్షంగా కరంటు తీగలు తెగిపోవడం కాదు, కరంటు స్థంబాలే భయంకరంగా మెలితిరిగిపోయి రోడ్లమీద పడి వున్నాయి.

"రావద్దంటే ఇనలేదు చూడు కొంటానికి గాని, తింటానికి గాని ఏమీ దొరకటం లేదు. యిప్పుడేడుప్." కిరీట్రావ్ నాన్న కోపాన్నంతా కిరీట్రావ్ మీద చూపెట్టాడు.

ఎట్టకేలకు ప్రజలే రోడ్డుమీద అడ్డంకులు తొలగించడం మొదలుపెట్టడంతో కాట్రేనికోన నుంచి నడుచుకుంటూ బయలుదేరారు. దారిపొడగునా చూడడానికి శిథిలాలు, వేళ్ళతో పెళ్ళగించబడిన మహావృక్షాలు, మొదలు విరిగి పడిపోయిన, నగం విరిగి పడిపోయిన, తలలు విరిగి పడిపోయిన కొబ్బరి చెట్లను చూస్తుంటే అందాల కోనసీమ వికృతి కనపడుతోంది. అన్ని ఇబ్బందులను, ఇక్కట్లను ఎదుర్కొంటూ బలుసుతిప్ప వరకూ ఎలాగో చేరుకోగలిగారు. అంతే అక్కడితో ఆగిపోయింది వారి ప్రయాణం. మగసానితిప్పకు నావ కట్టమని అడిగితే "ఎయ్యి రూపాయలిత్తే కడతాం" అని కరాకండిగా చెప్పేస్తున్నారు. సముద్రంలోకి వెళ్ళిన నావలన్ని గల్లంతైపోయాయి. ఒడ్డున వున్నా ఉప్పెన దెబ్బకి చాలమట్టుకు నావలు దెబ్బతిన్నాయి.

ఇంతలో ఎవరో క్రిష్టియన్ మిషనరీలు వెయ్యి రూపాయలు ఇచ్చి మగసానితిప్ప వెళ్ళడానికి నావను మాట్లాడుకొన్నారు. "అయ్యా మా వాళ్ళందరూ మగసాని తిప్పలోనే వున్నారు. ఎవరు బతికున్నారో తెలియదు సాయం చెయ్యండని" కిరీట్రావ్ నాన్న మిషనరీలను బతిమిలాడితే వీళ్ళను కూడా నావ ఎక్కించుకొన్నారు.

నావలు ఎందుకు కట్టనన్నారో, కట్టిన వాడు కూడా అంత ఫుల్‌గా ఎందుకు తాగి వచ్చాడో కొద్దిసేపటిలోనే కిరీట్రావ్‌కి అర్థమవ్వడం మొదలైంది. మడా అడవులు అరకిలోమీటరు దూరం వుండగానే కుళ్ళిన శవాల నుంచి వస్తున్న దుర్గంధానికి ముక్కులు పగిలిపోతున్నాయి. నావ మడా అడవి కాలవలోకి తిరగ్గానే ఎదురౌతున్న అతి భయంకర దృశ్యాలు గుండెను జలదరింప చేస్తున్నాయి. ఆ దృశ్యాలను చూసి కిరీట్రావ్ తట్టుకోలేక ఎక్కిళ్ళు పెట్టి ఏడ్చేస్తున్నాడు. ప్రతి మడచెట్టు పొదలోనూ పది నుంచి పాతిక వరకు శవాలు. గుర్తుపట్టలేనంత భయంకరంగా ఉబ్బిపోయి, భాగాలు విడిపోయి చెల్లాచెదురుగా పడి వున్నాయి. బోటులోని క్రైస్తవ సిస్టర్లు శవాలను చూడలేక కళ్ళు మూసుకొని ప్రార్థనలు చేసుకొంటున్నారు. కిరీట్రావ్‌కి భయమేసి బావురుమంటూ వాళ్ళ నాన్నను వాటేసుకొన్నాడు.

అది మగసానితిప్ప కాదు, శవాల దిబ్బ. సేవ చేయడానికి వచ్చిన క్రైస్తవ మిషనరీలే కాళ్ళు చేతులాడక ఆ నావలో కూర్చుండిపోయారు. కుక్కలు, పీతలు పీక్కుతింటున్న శవాల మధ్య నుంచి కిరీట్రావ్ వాళ్ళ నాన్న కిరీట్రావ్ తాత వుండే గుడిసెల వైపు నడుస్తున్నాడు. అక్కడ ఇంతకు ముందుండే రాజుగారి కొబ్బరి తోట లేదు. చెట్లన్నీ కూలిపోయి అవతలి సముద్రం కనపడుతోంది. ఎదురుగా గుడిసెలు లేవు. చిన్న చిన్న దిబ్బలు గుడిసెల ఆనవాళ్ళుగా మిగిలి వున్నాయి. మిగిలి వున్న పది మంది పూర్వం గొర్రలు కట్టే దిబ్బమీద కూర్చుని ఆకాశం వైపు చూస్తున్నారు. అందరి నోళ్ళు పిడచగట్టుకుపోయి వున్నాయి. ఎప్పుడు హెలికాప్టర్ వస్తుందా, ఎప్పుడు నీళ్ళ ప్యాకెట్లు క్రింద పడేస్తారా?! అని ఎదురు చూస్తున్నారు. పీక్కుపోయిన దవడలు, చింపిరి జుట్టులతో, కకావికలైన మాసిన గుడ్డలతో 'సోమాలియా' జనాల్లా వున్నారు.

వాళ్ళలోంచి కిరీట్రావ్ తాత బలరాముడు లేచి ఎదురొచ్చి కిరీట్రావ్ రెండు చేతులూ పట్టుకొని "ఒరే బాబా ఏం సూద్దామని యింత దూరం వచ్చేవురా?... అంతా అయిపోయిందిరా... అందరూ సచ్చిపోయార్రా... నీకు వన్నం పెట్టడానికి మీ అమ్మమ్మ ఇక లేదుర్రా... దాంతో పాటే ఆవులు కొట్టుకుపోయాయి... మీ పిన్నెలు కూడా ఎల్లిపోయార్రా అయ్యా... నేను వంటి పిల్లి రాకాసిలా బెతికున్నానుర్రా... అళ్ళందరి ఆయుస్సు పోసుకొని గుండ్రాయిలా బతికున్నార్రా..." ఒక్కొక్క మాట మాట్లాడానికి అయిదేసి నిముషాలు తీసుకొని ఏడువులోనే విషయాలు ఏకరువు పెట్టాడు.

కూర్చుని ఏడుస్తున్న బలరాముడు ఏదో గుర్తుకొచ్చిన వాడిలా గబుక్కున లేచి వెళ్ళి దూరంగా బండరాయి క్రింద దాచిన పొట్లం పట్టుకొచ్చి కిరీట్రావ్‌కిచ్చి "తినరా మా అయ్య తినరా... నిన్న యిమానం నుంచి ఏసిన పొట్లం... ఎవరన్నా బతికుంటే తిరిగొత్తారు... ఆకలిమీద వుంటారని నేనే దానిని తినకుండా దాచి వుంచా... తినరా మా అయ్య తినరా... మీకు ఎట్టడానికి మాకాడ యింతకంటే ఏం లేదుర్రా..." అవి మాటలు కాదు సమ్మెట పోట్లు వాటికి చిన్న పిల్లాడు కిరీట్రావ్ ఏం తట్టుకోగలడు ఏడవడం తప్పించి.

"ఒరే నారాయుడూ! మొత్తం ముప్పై మందికి మేమే బెతికేంరా...తుఫాను మేడ ధూరంగా వుండడంతో అందరూ కొట్టుకుపోయార్రా.... ఆ రోజు ఓరుగాలే లేకుంటే నేనూ, కిట్టుడు మరో నలుగురినైనా బెతికించే వాళ్ళమేరా. ..ఆ రేతిరి కటిక చీకటి, చెవిపక్కన నోరెట్టి అరచినా యినపడక మమ్మల్ని అట్టుకోలేక నీ మరదళ్ళు కళ్ళెదురే కొట్టుకుపోయార్రా. నీటితో డబ్బులు సంపాదించుకొందామని వచ్చి అదిగోరా ఏలాది మంది చచ్చిశవాలై పోయారు. నీటిమీద సంపాదించిన లచ్చలను నీరే అట్టుకుపోయింది బలరాముడు వేదాంత ధోరణిలో కిరీట్రావ్ నాన్నకు చెప్పేస్తున్నాడు.

ఇంతలో మిషనరీ ఫాదర్. సిస్టర్లు సామానులు మోయించుకొంటూ కిరీట్రావ్ తాతావాళ్ళు ఉన్న దిబ్బమీదకు వచ్చారు. 'కాట్రేని కోన చర్చి ఫాదరు జోసఫ్ చెప్పాడు. ఇక్కడ ఉన్న ఎస్.సీలను ఎవరూ పట్టించుకోవడం లేదట నిజమేనా?' ఇంగ్లీషు యాసతో తెలుగు మాట్లాడుతూ అడిగాడు ఆ టీమ్‌లీడరు.

'అవునండి దొరగారు. ఎవరన్నా సామాను తెత్తే ఆ పల్లెకారులకే ఇచ్చి ఎల్లి పోతన్నారండి. సామానులు మాకేటి వద్దుకాని తవరు. కలెట్టేరు గారితో సెప్పి ఈ సెవాలను పాతిపెట్టించమని సెప్పండి దొరగారు. ఆటిని సూసి సూసి మేము సచ్చిపోయేలాగున్నాము'కిరీట్రావ్ తాత, చిన తాత గత నాలుగు రోజులుగా అనుభవిస్తున్న బాధను వెళ్ళబోసుకొన్నారు.

ఈలోగా ఒక సిస్టర్ అక్కడున్న వారికి ఇంజక్షన్లు ఇచ్చింది. మందుపొట్లాలు ఇచ్చి ఎలా వాడాలో చెబుతుంది. మిగిలిన వారు దుప్పట్లు, రగ్గులు, బట్టలు పంచిపెట్టారు. నూనె డబ్బాలు, గోదుమ నూక నావలో ఉండిపోయింది.

మిషనరీలు వస్తువులు పంచిపెట్టడం చూస్తుంటే బలుసుతిప్ప వరకు వచ్చే దారిలో చూసిన విషయాలు గుర్తుకొచ్చాయి కిరీట్రావ్‌కి. ఉప్పెన బీభత్సం వల్ల వేలాది మంది చనిపోయారని, ఇళ్ళన్నీ కూలిపోయి నిరాశ్రయులయ్యారని తెలిసి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు బట్టలు లారీల మీద తెచ్చి పంచిపెడుతున్నారు. లారీలు నిజంగా దెబ్బతిన్న ప్రాంతాలకు వెళ్ళే పరిస్థితులు లేకపోవడంతో తెచ్చిన సామానులు రోడ్డు ప్రక్కనే ఉన్న గ్రామాల ప్రజలకు పంచిపెట్టి వారి దాన,

మిగతా 13వ పేజీలో





65

## దీర్ఘకాల ఆస్త్మా వ్యాధిగ్రస్తులకు-వరప్రదాయిని
# అడ్డసరము

అడ్డసరము మొక్కను అడదళపాకు అని కూడా అంటారు. దీనిని సంస్కృతంలో 'వసాక' అని అంటారు. శాస్త్రీయంగా దీనిపేరు 'అడథోడా వాసికా' లేక జస్టీషియా అడథోడా. ఇది అకాంథేసి కుటుంబానికి చెందిన మొక్క. సామాన్యంగా పొలాల గట్లమీద, ఇండ్లలోను, ఉద్యాన వనాల్లోను, కంచెలాగా పెంచే మొక్క. గుబురుగా, పెద్దపత్రాలను ఏర్పరిచి పెరిగే పొద. తెల్లటి పుష్పాలు కొమ్మల చివర, కంకిలాంటి పుష్పవిన్యాసం మీద ఏర్పడుతాయి. ఈ మొక్క సామాన్యంగా గ్రామీణులందరికి తెలిసిన అందుబాటులో వున్న మొక్క. అయితే దీని ఔషధ ప్రాముఖ్యం అందరు మరిచి పోయారు. కానీ ఖర్చులేకుండా, రొమ్ముపడిశం, ఆస్త్మా, దగ్గు తగ్గించగలిగిన మొక్క మన పెరడులో వుంది అనే విషయం తెలుసుకుంటారని వ్రాయడం జరిగింది.



ఈ మొక్క యొక్క వేర్లు, పత్రాలు, బెరడు, ఔషధంగా ఉపయోగిస్తారు. ఈమొక్కలో 'వాసైన్' అనే ముఖ్యమైన ఆల్కలాయిడ్, మరియు అడథోడిక్ ఆమ్లము వున్నాయి. ఈ మొక్కను సులభంగా ప్రతి ఒకరు పెరటితోటలో పెంచుకోవచ్చు. పెన్సిల్ మందం వున్న కొమ్మలు త్రుంచి నాటితే పెరుగుతాయి. నీరు ఎక్కువ అవసరం లేదు. దీని ప్రతాలను కషాయం కాచిగాని, లేక దంచి రసం తీసిగాని, తేనెలోగాని, అల్లం రసంతోగాని తీసుకుంటే రొమ్ముపడిశము, ఆస్త్మా, దగ్గు, నిస్సత్తువ తగ్గుతుంది. ఈ రకంగా వేరు కూడా ఉపయోగించవచ్చు. పత్రాల రసం ఇస్తే, తరచుగా వచ్చే దగ్గు, విరేచనాలు, బంకవేదులు తగ్గించడమేగాక, దగ్గితే రక్తం పడటం, రక్త విరేచనాలను తగ్గిస్తుంది. చిక్కటి కషాయం కాచి, దానితో కాపడం పెడితే, ర్యుమాటిజమ్ వలన కలిగిన కీళ్లనొప్పులు, నరాల బాధలు తగ్గుతాయి. పత్రాలు నూరి పట్టుగా వేస్తే, తామర గజ్జి మొదలగు వ్యాధుల వలన గలిగే దురద తగ్గి, క్రమేపి మానుతాయి. ముఖ్యమైన ఔషధ ప్రక్రియ మరుగుపడి, ఇప్పుడిప్పుడే వెలికి వస్తున్నది దీనిలో వుంది. పత్రాలు పొడిచేసి, కడుపులోకి తీసుకుంటే, తరచుగా వచ్చే జ్వరాలు, టి.బి., మలేరియా తగ్గుతుంది. ఈ పత్రాల కషాయానికి టి.బి. రాకుండా చేసే శక్తి కూడా వుంది. 'సారంగధరుడు వేరుకషాయాన్ని జ్వరం, దగ్గు తగ్గడానికి ఇస్తే మంచిదని వివరించి యున్నాడు. అలాగే దీని పత్రాలనుపయోగించి తయారుచేసిన 'వాసవ లేహ్యం' ఆస్త్మా, దగ్గు నోటినుంచి రక్తం పడడం తగ్గిస్తుందని వివరించి యున్నాడు. భావప్రకాశలో గూడా, దీని ప్రాశస్తం గురించి చెప్పివున్నారు. బైషజరత్నావళిలో ఈ పత్రాల, వేరు ఉపయోగించి వివిధ మూలికలతో తయారుచేసిన 'వస చందనాది తైలం'ను మూర్ఛ, హిస్టీరియా, పిచ్చి, రొమ్ముపడిశం, ప్లురసీ మొదలగు వ్యాధులకు పై పూతగా అద్భుతంగా పనిచేస్తుందని వివరించి వున్నారు. ఈ పత్రాల రసం, నువ్వుల నూనెలో కలిపి కాచి, హెర్‌టానిక్‌గా వాడ్తే, ముండ్రుతగ్గి, కేశవృద్ధి కలుగుతుంది. ఇన్ని గుణాలున్న మొక్కను అశ్రద్ధచేయడం మంచిదిగాదు. ఇకనైనా గుర్తించి మనకుఅందుబాటులోవుండే టు పెరటితోట లో పెంచుకొని ఔషధ ప్రాముఖ్యాన్ని పరీక్షించండి.

**–డాక్టర్ ఎస్.వేదవతి**

మందు మొక్కల మీద విస్తృత పరిశోధనలు జరిపిన డ్యాక్టర్ ఎస్.వేదవతి, తిరుపతి ఎస్.వి. ఆర్ట్స్ కాలేజీలో వృక్షశాస్త్ర విభాగానికి అధిపతిగ పనిచేస్తున్నారు. న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతిలో నడిచిన హెర్బల్ ఫోక్‌లోర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా ఆమె బాధ్యతలు నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో మారుమూల



పల్లెల్లోనూ, అటవీ ప్రాంతాల్లోనూ పర్యటించి అంతరించిపోతున్న ఔషధ మొక్కలను సేకరించారు. ఎన్నో మందు మొక్కల గురించి సమాచారం సేకరించి ఇంగ్లీష్‌లోను, తెలుగులోను పుస్తకాలు ప్రకటించారు. తిరుపతి తిరుమల దేవస్థానం సహకారంతో తిరుపతిలో ఆమె ప్రయోగాత్మకంగా **150** రకాల మందు మొక్కలతో కూడిన వనం పెంచారు. 'మందు మొక్క' శీర్షికలో ప్రచురిస్తున్న డ్యాక్టర్ వేదవతి సేకరించిన విలువైన సమాచారం పాఠకులకు ఎంతో ఉపయుక్తం కాగలదు.

## ఇలా చేస్తే సరి!



* ముక్కుపై కళ్ళ జోడు మచ్చలు పడకుండా వుండాలంటే రోజూ రాత్రి పడుకునే ముందు కొబ్బరి నూనె రాస్తే సరి.



◐ పచ్చి మిరపకాయలు కోసినప్పుడు చేతులు మంటపుడితే పంచదార కలిపిన నిమ్మరసంతో రుద్దితే మంట తగ్గుతుంది.



◐ తేనెను సున్నంతో రంగరించి పట్టు వేస్తే బెణుకులు, నొప్పులు తగ్గిపోతాయి.



◐ వెల్లుల్లి పాయలను బియ్యం డబ్బాలో వుంచితే పురుగు పట్టదు.



◐ వేప చెక్క రసంలో తేనె కలిపి తీసుకుంటే కామిల రోగం తగ్గిపోతుంది.

–యస్.శివానంద్

---

కథ: తెల్లమడచెట్టు
12వ పేజీ తరువాయి

ధర్మ ఫలం దక్కించుకొని వెళ్ళిపోయారు. బాధితులకందవలసిన వస్తువులు దెబ్బతి నని మన కెందుకనే మానవ మాత్రులు కిరీట్రావ్ కంటికి కనపడలేదు.

సామానులతో లారీ కనపడితే చాలు దానిని దారి దోపిడి గాళ్ళు ఆపినట్లు ఆపి సామానులను బలవంతంగా పంచి పెట్టిం చుకొంటున్న ప్రజల ఆబను జీర్ణించుకునే వయస్సులేదు కిరీట్రావ్‌కి.

రెండురోజులుగా సరైన ఆహారం లేక, నిద్రలేక పోవడం మరో ప్రక్క భయం ఆందోళన తోపాటు ఆ దీవిలోని కాలుష్య వాతావరణానికి కిరీట్రావ్‌కి వికారం మొదలు పెట్టింది. రెండు వాంతులు చేసుకొని సొమ్మసిల్లి పడిపోయారు. తెలివి వచ్చి చూసేసరికి అమలాపురం మిషను ఆసుపత్రిలో ఉన్నాడు. చెయ్యి నొప్పిగా ఉంది ఎందుకని చూసుకొంటే పైన సెలైన్ బాటిల్ వ్రేలాడుతుంది. మన స్సంతా దిగులు, వళ్ళంత జ్వరం, సెలవు అయిపోయిందని కిరీట్రావ్‌ని అలాగే బస్సు ఎక్కించి విశాఖపట్నం తీసుకెళ్ళి పోయాడు కిరీట్రావ్ నాన్న. కిరీట్రావ్‌కి పది రోజుల వరకు జ్వరం, కలవరింతలు తగ్గనే లేదు.

చచ్చిపోయిన వాళ్ళకు దినం పదకొండో రోజునే చేయాలట. అదేలాగు కుదరదని నలభైవ రోజున పెట్టారు. ఒకే రోజున ఇరవై మందికి దినం. కిరీట్రావ్ వాళ్ళ అమ్మమ్మ దినం రోజే ఆ ఊరిలో భైర వస్వామి యజ్ఞం. తుఫానులు, ఉప్పెనలు రాకుండా గ్రామ ప్రజలను కాపాడాలని అమలాపురం నుంచి పెద్ద పెద్ద పురోహి తులను తెప్పించి యజ్ఞం చేయిస్తున్నా రట. అత్తలక్ష్మి ఈ విషయాన్ని చాలా ఆనందంగా చెప్పింది. 'పాపం పూజారి గారి ఇంట్లో కోడలు మొన్నచ్చిన ఉప్పెనలో కొట్టుకుపోయింది. పిల్ల పూజారి, పార్వ తమ్మగారు పెంకుటిల్లు ఎక్కి పేణాలు కాపాడుకొన్నారు... పోనిలే ఈ పెద్ద పూజలు సేస్తే దేవుడు సల్లగా సూత్తాడు. మల్లా ఇలాంటి మాయదారి ఉప్పెనలు రావు' చాలా ఆత్మవిశ్వాసంతో వివరించింది లక్ష్మిత్త.

కొట్టుకు పోయిన ఇళ్ళ స్థానే చినిగి పోయిన ప్లాస్టిక్ సంచులు కట్టుకొని గుడా రాలు వేసుకొన్నారు కిరీట్రావ్ బంధువులు. ఆ కిరస్తాని దొరలు ఇళ్ళు కట్టుకోవడానికి తాటాకు, ఎదురూ ఇచ్చారు. తెచ్చుకొనేం దుకు నావలేక పోవడంతో నావలున్న ఆ పల్లెనాయళ్ళే ఆటిని తెచ్చుకున్నారు. చాలా ఉక్రోషంగా చెప్పాడు కిరీట్రావ్ తాత బలరాముడు.

'నాలుగేళ్ళ కితం మాట అప్పుడూ ఇలాం టిదే పెద్ద తుఫాను వచ్చింది. ఏదో దేశం నుంచి డింగీ నావ కొట్టుకొచ్చి మడ అడివి బురదలో కూరుకుపోయింది. నేనూ కిట్టుడూ ఎంతో కష్టపడి దానిని బయటకు తీసి మన యిళ్ళకాడకు లాక్కొచ్చాం కాని ఏం లాభం? నావ ఎక్కడి నుంచి కొట్టుకొచ్చినా మా మచ్చకారులదేనని ఈ గేమ పెద్దలు మాగొప్ప తీరుపు యిచ్చేరు. దాన్ని పట్టుకుపోయి అమ్మేసుకొని వూలుగా తాగేశారు. మారెక్కల కష్టాన్ని ఈనా యళ్ళే సగానిసగం తినేత్తన్నారు' కిరీట్రావ్ నాన్నను కూర్చోబెట్టుకొని అక్కడ అంట రాని వాళ్ళకు జరుగుతున్న అన్యాయాన్ని వెళ్ళగక్కేడు బలరాముడు.

మనోళ్ళు ఆరు తరాల్నించి ఈ తిప్పమీదే వుంటున్నారు. మనకు లేని భూములు అమలాపురంలో కూర్చున్న మారాజుల కెలా వచ్చేయో తెలియదు. ఈ తిప్పమీద భూములన్నీ ఆళ్ళపేర కాగాతాల్లో వున్న యంట. సూపెట్టమని మన కుర్రోళ్ళు అడిగితే పెతి ఎదవానాకొడిక్కి సూపె ట్టిలా? అని సీత్కారం సేశారు. ఈ మచ్చకారులకి భూములక్కర లేదు. సముద్రం సాలు ఆ సత్తెనారాయణరాజు సంవత్సరానికో మాటు ఈళ్ళకు సారా పోయిత్తాడు. అందుకని యీళ్ళందరు ఆడిమాటే కూత్తారు' చినతాత కృష్ణుడు అసలు **లిటికేషన్** బయటకు **లాగేడు**.

మనం ఎలాగు సచ్చి బతికినోళ్ళమే. పోయినోళ్ళందరూ ఎలగోపోయారు. ఆల మందా పోయింది. ఇప్పుడు మనం బతకడమెలా? మనం మనకు కావలసి నంత భూమికి కంచె ఏద్దాం. ఎవడైనా అడ్డ మొస్తే ఈ తిప్పలో పాతేయడమే' కిరీట్రావ్ మేనమామ అభిమన్యుడి మాటల్లో తిరు గుబాటుదనం కంటే జరుగుబాటు దనం గురించిన ఆరాటమే ఉంది.

తుఫానులో సచ్చిపోయినోళ్ళకి లక్ష ఇత్తా మని ప్రభుత్వం పెకటించింది కదా బావా! అందులో ముందు అయిదేసి వేలు ఇస్తా మన్నారంట. మన వాళ్ళ ఇరవై మందికి లక్ష రూపాయలియ్యాలి. ఆ డబ్బుల గురించి వాన్నోళ్లను వందసార్లు కాత్రేని కోన, అమలాపురం తిప్పేరు. ఆడబ్బు



లియ్యడానికి పదివేలు లంచం ముంది య్యాలట అపదివేలే ఉంటే ఈ దినం నెలర్రోజుల కిందే చేసే వాళ్ళంగా, సచ్చి పోయిన వాళ్ళ మీద వచ్చే డబ్బుల కోసం ఈళ్ళ చుట్టు ఎందుకుఁరుగుతారు. కోపంతో ఎరుపెక్కిన మొహంతో అన్యాయాన్ని కూక టివేళ్ళతో పెకలించి పారేయలన్న ఆవేశంతో చెప్పింది చినతాత కూతురు యశోద. ఆమె పదవతరగతి చదవడానికి అమలపురంలో హాస్టల్లో ఉంటుంది. అందుకే బతికి బట్టకట్టింది.

ఎవరి గొడవల్లో వాళ్ళు ఉన్నారు. ఉదయం నుంచి లక్ష్మత్త భైరవస్వామి యజ్ఞంలో ఏం జరుగుతుందో దూరంగా ఉండి చూసిరమ్మని గంటకోసారి కిరీట్రావ్‌ని గుడి దగ్గరకు పంపుతోంది. ఉదయాన్నే భైరవస్వామిని ఆలయం నుండి పల్లికిలో తీసుకొచ్చి నావ ఎక్కించి చుట్టుప్రక్కల గ్రామాలు తిప్పి తెచ్చారు. గుడిలోపల ఏదో తతంగం జరుగుతోంది. బ్రాహ్మణులు ప్రతిపనికి పూజారి గారి ఇంటికెళ్ళి విధవ రాలు పార్వతమ్మను సలహాలు అడుగు తున్నారు.

ఉదయం పదకొండు గంటల కను కుంటాను కిరీట్రావ్ అత్త లక్ష్మి, అమ్మ, మరో ఇద్దరు కిరీట్రావ్ చుట్టాలు కొబ్బరి కాయలు, అగరపత్తులు, అరటి పళ్ళు పట్టుకొచ్చి గుడి ప్రహరీగోడ బయట నిల బడ్డారు. అక్కడ కుళ్ళుకాలవ ప్రక్కనే ఉన్న చిన్న రాయిమీద కొబ్బరి కాయలు కొట్టి, అగరవత్తులు వెలిగించి భూమిలో గుచ్చి దండాలు పెట్టున్నారు. ఇంతలో బుల్లిపూజారి బయటకు వచ్చి వీళ్ళను దూరంగా పొమ్మని అక్కడ వీళ్ళు కొబ్బరి కాయలు కొట్టి అగరొత్తులు వెలిగించిన చోట నీళ్ళు చల్లిమంత్రాలేవో చదివాడు.

గుడి ముందు ప్రహరీ గోడ బయటి చాలా కోలాహలంగా ఉంది. సంబరం జరు గుతున్నట్లు రకరకాల వస్తువులు అమ్ము కునే వాళ్ళు అంతదూరం వచ్చి కొట్టు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రక్క గ్రామాల నుంచి మత్స్యకారుల కుటుం బాలు నావల మీద వచ్చి మొక్కుబడులు తీర్చుకొంటున్నారు. గుడిలోపల బ్రాహ్మ ణులు యజ్ఞం చేస్తున్నారు. గుడి బయట మొక్కుబడుల పేరిట కోళ్ళు, మేకల తలలు తెగి రక్తం తెగ పారుతోంది. ఇది పౌరాణిక సినిమాలో దేవతలు యజ్ఞం చేస్తుంటే, రాక్షసులు రక్తం కుండతో తెచ్చి కుమ్మరిస్తున్న సీను గుర్తుకు తెస్తోంది.

నిజంగా ఆసీను కళ్ళెదుటే జరగడం బోలె డంత ఆశ్చర్యంలో ముంచేసింది కిరీట్రావ్‌ని. ఇంకొక ఆశ్చర్యకర విషయమేమిటంటే బుల్లి పూజారి బయట కొచ్చి రక్తంపడె చోట నీళ్ళు చల్లి మంత్రాలు చదవటం లేదు. మూడవ సారి మగసాని తిప్పకు వచ్చే ముందే మడ అడవుల గురించి, మడ చెట్ల గురించి తెల్సుకొచ్చాడు కిరీట్రావ్. నది సముద్రంలో కల్సేప్రాంతాలలో చిత్తడి నేలల్లోనే మాడా అడవులు ఏర్పడతాయి. చెట్టు చుట్టూర ఉన్నవి పిలకలు కాదు, ఊడలు కాదు అవిశ్వాస వేళ్ళు. సముద్రం పోటుమీద ఉన్నప్పుడు చెట్లు కొంత వరకు మునిగి పోతాయి అప్పుడు వేళ్ళకు గాలి దొరకదు. అందుకని కొన్ని వేళ్ళనుర్ధ్వపాం తరం చెందించి శ్వాస వేళ్ళలా మార్చుకొని ప్రతికూల పరిస్థితుల్లో బ్రతికేస్తుంది మడ చెట్టు.

దినం కార్యక్రమం పూర్తిఅయిన తరు వాత మధ్యాహ్నానికి సాయింత్రానికి మధ్య తిరుగు ప్రయాణం కొరకు బయలు దేరారు. వీళ్ళను సాగనంపడానికి బంధువు లందరూ రేవుకొచ్చారు. ఎందుకో ఏమిటో తెలియకుండానే కిరీట్రావ్ హృదయం బరువెక్కిపోతోంది. నావ ఎక్కికూర్చున్న కిరీట్రావ్‌కి దూరంగా కనపడుతున్న గుడిని, గుడి చుట్టూ తిరుగుతున్న మత్స్య కారులను చూస్తుంటే కదులుతున్న శ్వాస వేళ్ళలా అన్పించసాగారు.

నావ బయలుదేరుతుంటే బంధువులు ఎవరి ముఖాలు స్పష్టంగా కనపడటం లేదు. కిరీట్రావ్‌కి కళ్ళలో నీటిపొర అడ్డొచ్చేసింది. యజ్ఞం చేయిస్తున్నారు కాబట్టి ఉప్పెనలు, తుఫాన్లు వచ్చినా దేముడు వాళ్ళని రక్షి స్తాడు. గుడిలోపలికి వెళ్ళడానికే హక్కులేని వీళ్ళంతా ఈసారి ఉప్పెనొస్తే....ఇంక ఆలో చించలేకపోయాడు.

(1998లో కూడా క్షుద్రదేవుడి గుడికి వెళ్ళి దండం పెట్టుకునే హక్కులేని మగసాని తిప్ప అంటరాని వారి హీన స్థితికి జాలితో అంకితం)

వచ్చేవారం కథ:
**పొయెట్రీ కేఫ్**
-డాక్టర్ వి. చంద్రశేఖరరావు